

# బీడు భూముల్లో సాగు సంబురం

## ఏఎమ్మార్పీ వరద కాల్వ పూర్తితో 80 వేల ఎకరాలు సాగులోకి..

వరద కాల్వ పంప్‌హౌస్

- ఉమ్మడి రాష్ట్రంలో నత్తనడకన కాల్వ పనులు
- బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన రెండేండ్లలోనే పూర్తి
- 93,04,70,936 రూపాయలు వెచ్చించిన ప్రభుత్వం
- కాల్వ పూర్తితో ఏడు మండలాల రైతులకు మేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న హలదారులు

**సమైక్య పాలనలో తలాపున కృష్ణమ్మ పరుగెడుతున్నా నల్లగొండ జిల్లాలో సాగు, తాగు నీటికి కరువు ఉండేది. పచ్చని పైర్లతో కళకళలాడాల్సిన నేలలు నెర్రెలు బారేవి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, కాల్వల తవ్వకం దశాబ్దాలపాటు నత్తనడకన సాగడంతో జిల్లా ప్రజలు, ముఖ్యంగా నాగార్జునసాగర్ నియోజకవర్గ జనం తాగు, సాగునీటికి అరిగోస పడ్డారు. 2014లో స్వరాష్ట్రం సిద్ధించాక ఉద్యమ నేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఏఎమ్మార్పీ లోలెవల్ కెనాల్, పంప్ హౌస్ నిర్మాణానికి సుమారు రూ.93 కోట్లు వెచ్చించి రెండేండ్లలోనే పూర్తి చేయించారు. దాంతో గత ఆరేండ్లుగా నాగార్జునసాగర్, నల్లగొండ, మిర్యాలగూడెం నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో దాదాపు 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దాంతో నేడు పసిడి పంటలు పండుతుండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**

–హాలియా, డిసెంబర్ 12

ఏటా సముద్రం పాలవుతున్న వందలాది టీఎంసీల కృష్ణా జలాలను బీడు భూములకు మళ్లించి సేద్యంలోనికి తీసుకురావాలనే ఉద్దేశంతో 1997లో వరద కాల్వ నిర్మాణం చేపట్టారు. నాగార్జునసాగర్ జలాశయంలో 575 అడుగులకు పైగా నీరు ఉంటే గ్రావిటీ ద్వారా, అంతకంటే తక్కువగా ఉంటే పంపింగ్ ద్వారా నీటిని లిఫ్ట్ చేసి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో ఉన్న 80 వేల ఎకరాలకు సాగునీరు, వేలాది మందికి తాగునీరు అందించే ఉద్దేశంతో వరద కాల్వ నిర్మాణం చేపట్టారు. 175 కోట్లతో ప్రారంభమైన వరద కాల్వ పంప్ హౌస్ నిర్మాణం 2009 డిసెంబర్ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. కానీ, గత టీడీపీ, కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యంతో వరద కాల్వ, పంప్ హౌస్ నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పిన చందంగా సాగాయి. దాంతో వాటి నిర్మాణ వ్యయం పెరిగిందే తప్ప రైతులకు మేలు జరిగింది లేదు. ప్యాకేజీ 81 కింద రూ.70.85 కోట్లు ఖర్చు చేయగా, 110 ప్యాకేజీ కింద 65 కోట్లు ఖర్చు చేశారు.



వరద కాల్వ(ఫైల్)

### త్వరితగతిన పూర్తి చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దే..

నత్తనడకన సాగిన ఏఎమ్మార్పీ లోలెవల్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కింది. 2014లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని టెయిలెండ్ భూములకు సాగునీరు అందించాలనే సంకల్పంతో పంప్ హౌస్ నిర్మాణాన్ని వేగవంతం చేసింది. దివంతగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య పట్టుదల, నాటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ, ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నూతన ధరల ప్రకారం పంప్‌హౌస్ నిర్మాణ వ్యయాన్ని రూ.148 కోట్లకు పెంచడంతోపాటు సకాలంలో నిర్మాణానికి చర్యలు తీసుకోవడంతో 2016లో పనులు పూర్తవగా నవంబర్ 9, 2016న అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు.

### 93 కోట్లు విడుదల చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం..

2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం వరద కాల్వ పంప్‌హౌస్ నిర్మాణం కోసం 93,04,70,936 రూపాయలు విడుదల చేసింది. అందులో పంప్ హౌస్ నిర్మాణం కోసం 54,03,43,589 రూపాయలు, 110 ప్యాకేజీ కింద కాల్వ నిర్మాణం కోసం 39,01,27,347 రూపాయలు కేటాయించింది. పంప్‌హౌస్ నిర్మాణానికి రూ.148 కోట్లు, వరద కాల్వ కోసం 135.85 కోట్లు ఖర్చు అయ్యాయి.

### 80 వేల ఎకరాలకు సాగునీరు ..

నాగార్జునసాగర్, మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల్లోని ఏడు మండలాలైన పెద్దవూర, అనుముల, నిడమనూరు, త్రిపురారం, కనగల్, మాడ్గులపల్లి, వేములపల్లి ఎన్‌ఎస్‌పీ కింద స్థిరీకరించిన 30 వేల ఎకరాలు కలిపి మొత్తం 80 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. పెద్దవూర మండలంలో 9,191 ఎకరాలు, అనుముల మండలంలో 12,094 ఎకరాలు, నిడమనూరు మండలంలో 11,302 ఎకరాలు, త్రిపురారం మండలంలో 4,605 ఎకరాలు సేద్యంలోకి వచ్చాయి. అలాగే ఆయా నియోజకవర్గాల్లోని సుమారు 27 చెరువులను వరద కాల్వతో అనుసంధానం చేశారు. దాంతో భూగర్భజలాలు పెరిగి తాగు, సాగునీటి కొరత తీరింది.

### బీఆర్‌ఎస్ ప్రభుత్వ మేలును మరువలేం



బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాకే వరద కాల్వకు సాగునీరు వచ్చింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది నాగార్జునసాగర్ జలాశయంలోకి నీరు రాకపోవడంతో సాగునీరు రాలేదు. కానీ, గత ఆరేండ్లుగా వరద కాల్వ కింద వరి సాగు చేస్తున్నా. వరద కాల్వకు నీటి విడుదల చేయడంతో భూగర్భ జలాలు పెరిగాయి. వేసవిలో తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా పోయింది. ఈ ప్రాంత రైతులమంతా మాజీ సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

–కుంటిగొర్ల జనార్దన్, రైతు, కోసలమర్రి, అనుముల మండలం

### భూగర్భ జలాలు భారీగా పెరిగినయ్



అసంపూర్తిగా ఉన్న వరద కాల్వ పనులను పూర్తిచేయించడంతోపాటు ఆరేండ్లుగా కాల్వకు సాగునీటిని విడుదల చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే. వరద కాల్వకు సాగునీటిని విడుదల చేయడంతో భూగర్భజలాలు భారీగా పెరిగాయి. వరదకాల్వతోపాటు బోర్ల కింద రైతులు వరి, పండ్లతోటలు సాగు చేస్తున్నారు. గతంలో వరద కాల్వకు నీళ్లు రానప్పుడు భూములన్నీ బీళ్లుగా ఉండేవి. కానీ నేడు ఆ పరిస్థితి లేదు.

–కున్‌రెడ్డి మధుసూదన్‌రెడ్డి, రైతు, బట్టుగూడెం, పెద్దవూర మండలం

# ధాన్యం ఉత్పత్తిలో మనమే టాప్

## రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉమ్మడి నల్లగొండ జిల్లా



ఆర్జాలబావి ఐకేపీ కేంద్రంలో ధాన్యం రాశులు(ఫైల్)

- తొమ్మిదిన్నరేండ్లలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు
- అందుబాటులోకి పుష్కలంగా సాగునీటి వనరులు.. 24 గంటల విద్యుత్
- నాడు కరువు నేలలో నేడు సిరుల పంటలు
- 13.54లక్షల ఎకరాలకు పెరిగిన వరి సాగు
- 33.85లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి
- వలస జిల్లాకే వలసొచ్చేలా గణనీయమైన వృద్ధి

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్12(నమస్తే తెలంగాణ) : సమైక్య పాలనలో కరువు జిల్లాగా ముద్రపడిన నల్లగొండ జిల్లా రూపురేఖలు స్వరాష్ట్రంలో పూర్తిగా మారిపోయాయి. రాష్ట్రం సాధించిన తొలి ఏడాది నుంచే నాగార్జునసాగర్ ఆయకట్టుకు కృష్ణాజలాల్లోని నీటి వాటాను వినియోగిస్తూ రెండు పంటలకు సాగునీరు అందించడం ప్రారంభమైంది. ఆ తర్వాత కాళేశ్వరం జలాలు తోడయ్యాయి. అంతేకాకుండా 2018 నుంచి వ్యవసాయానికి అందిస్తున్న 24 గంటల కరెంటు సరఫరా మరింత పురోభివృద్ధికి బాటలు వేసింది. రైతన్నకు ధైర్యం కల్పిస్తూ పెట్టుబడి సాయం తోడైంది. ఇవన్నీ వెరసి వరి సాగులో ఉమ్మడి నల్లగొండ జిల్లా ధాన్యాగారంగా మారింది.

### 4.44 లక్షల నుంచి 13.54 లక్షలకు పెరుగుదల

స్వరాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండలో 305 శాతం వరి సాగు పెరిగితే, సాగైన ప్రతి గుంటకూ సాగునీరు అందడం విశేషం. 2014 నుంచి నేటి వరకు వరి సాగు విస్తీర్ణాన్ని పరిశీలిస్తే.. గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో అదనంగా 9.10 లక్షల ఎకరాల్లో వరిపంట సాగైనట్లు వ్యవసాయ శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. 2014 వానకాలంలో ఉమ్మడి జిల్లాలో వరిసాగు కేవలం 4.44 లక్షల ఎకరాల్లోనే జరిగింది. కాగా, ఈ ఏడాది వానకాలంలో ఉమ్మడి జిల్లాలో అది 13.54 లక్షల ఎకరాలకు పెరుగడం విశేషం. ప్రస్తుతం వరిసాగులో నల్లగొండ రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. జిల్లా నలువైపులా సాగునీటి వనరులు విస్తృతంగా అందుబాటులోకి రావడంతోనే ఈ ఘనత సాధ్యమైందనడంలో సందేహం లేదు.

### 33.85 లక్షల టన్నుల ధాన్యం ..

2014 వానకాలంలో 12.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనాకు గానూ వచ్చీరానీ కరెంటుకు తోడు భూగర్భజలాలు సరిగా లేక 7.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే చేతికి వచ్చింది. ఇందులో స్థానిక అవసరాలకు పోను కేవలం 61వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. కానీ, నేడు గత యాసంగిలో ఉమ్మడి జిల్లాలో 13.54 లక్షల ఎకరాల్లో వరిసాగైతే ఒక్క గుంట కూడా ఎండకుండా చేతికొచ్చింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 33.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం చేతికి రాగా, అందులో స్థానిక అవసరాలు పోగా 12.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయడం విశేషం. ఇందుకు గానూ రైతులకు అందిన మద్దతు ధర అక్షరాల రూ.2,255 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమైంది.

### సాగు విస్తీర్ణం రెట్టింపు

ఉమ్మడి జిల్లాలో ఈ పదేండ్ల కాలంలో సాగు నీటి వనరులు ఊహకందని రీతిలో పెరుగడంతో పాటు ప్రభుత్వం వైపు నుంచి అన్ని రకాలుగా ప్రోత్సాహం లభిస్తుండడంతో పంటల సాగు విస్తీర్ణం ఊహించని రీతిలో పెరిగింది. పదేండ్లలో అన్ని పంటల సాగు రెట్టింపైంది. ఉమ్మడి జిల్లాలో 35.10 లక్షల ఎకరాల భూమి అందుబాటులో ఉంది. ఇందులో 2014లో అన్ని పంటలు కలిపి మొత్తం సాగు విస్తీర్ణం 13.12 లక్షల ఎకరాలకే పరిమితమైంది. కానీ, ప్రస్తుతం అది రెట్టింపు దాటి 26.50 లక్షల ఎకరాలకు చేరుకోవడం గమనార్హం. ఇందులో ప్రధానంగా వరి సాగు విస్తర్ణమే 9.10 లక్షల ఎకరాలకు పెరిగింది. మిగతా అన్ని పంటలు కలిపి మరో 4 లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగింది. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టుతో పాటు ఏఎంఆర్‌పీ లోలెవల్, హైలెవల్ కాల్వలకు సాగు నీరు అందుబాటులోకి వచ్చింది. కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలు, మూసీ ద్వారా అదనపు జలాలు, చెర్వులు, కుంటల ద్వారా భూగర్భజలాలు ఇలా అన్ని వైపులా సాగునీరు పుష్కలంగా లభిస్తున్నది. దాంతో సాగును వదిలి వెళ్లిన వారంతా తిరిగి వ్యవసాయంపై దృష్టి సారించడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయం పండుగలా సాగుతున్నది. ఏటికేడు పంటల సాగు, దిగుబడులు, రైతుల ఆదాయం పెరుగుతూ పోతుంది.



# యోగానంద లక్ష్మీనర్సింహుడికి మహా రాజగోపురం

## చకచకా జరుగుతున్న పనులు



దేవాలయం ఎదుట నిర్మిస్తున్న తూర్పు రాజగోపురం



ఆలయ ప్రాంగణంలో పని చేస్తున్న శిల్పులు

అర్వపల్లి, డిసెంబర్ 12 : సూర్యాపేట జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అర్వపల్లి యోగానంద లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానం పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ తూర్పు మహారాజ గోపురాన్ని కృష్ణ శిలలతో అద్భుతంగా నిర్మిస్తున్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి.. తన తల్లి సావిత్రమ్మ జ్ఞాపకార్థం సుమారు రూ.1.30 కోట్ల సొంత ఖర్చుతో మహారాజ గోపురం నిర్మాణ పనులను గతంలోనే ప్రారంభించారు. ప్రస్తుతం రాతి పనులు చకచకా జరుగుతున్నాయి. ఏపీలోని కోటప్పకొండ నుంచి కృష్ణ శిలలు తెప్పించారు. 18 అడుగుల ఎత్తు వరకు రాతితో నిర్మించిన తరువాత ఇటుకలతో పనులు చేపట్టనున్నారు. ఈ మహా రాజగోపురం ఎత్తు 55 అడుగులు ఉండనున్నది. తమిళనాడు రాష్ట్రం నుంచి శిల్పులను రప్పించి పనులు చేయిస్తున్నారు. కృష్ణ శిలలను చెక్కే పనులు వేగంగా జరుగుతున్నాయి. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ దేవస్థానం సమైక్య పాలకుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకోగా స్వరాష్ట్రంలో కొత్తరూపు సంతరించుకున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.1.20 కోట్లు మంజూరు చేయగా పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరింత అభివృద్ధి కోసం గత ప్రభుత్వం 5 కోట్లు మంజూరు చేసింది. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సొంత నిధులు రూ.20 లక్షలతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ పునర్నిర్మాణంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పక్కాగా పది ప్రణాళిక

టెన్త్‌లో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు

## నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసేలా కార్యాచరణ

### ప్రతిరోజూ స్పెషల్ క్లాసులు.. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం పాతర్లపహాడ్ హైస్కూల్‌లో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

**పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యా శాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలుచేస్తున్నారు. కార్యాచరణలో భాగంగా డిసెంబర్ 31 వరకు సిలబస్ పూర్తి చేసేందుకు సూర్యాపేట జిల్లాలోని 238 ప్రభుత్వ పాఠశాలలైన జడ్పీ, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ప్రతిరోజూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటుచేసి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారు. 100 శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.**

–సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 12

సూర్యాపేట జిల్లాలో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే అధికారులు ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి వారి సూచనల మేరకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉండడంతో సాధ్యమైనంత వరకు వాటిని అమలు చేయాలని సూచించింది. జిల్లాలోని 238 పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల కోసం జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం సబ్జెక్ట్ నిపుణులతో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలంటే ఉపాధ్యాయులు వారి సబ్జెక్టులను డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసి విద్యార్థులకు అవసరమైన పరీక్షల నిర్వహణ చేపట్టాలని నిర్ణయించి ఆ దిశగా ముందుకెళ్తున్నారు.

### 31 నాటికి సిలబస్ పూర్తయ్యేలా చర్యలు..

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం రూపొందించిన ప్రణాళికను ఇప్పటికే జిల్లాలోని 238 ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. డిసెంబర్ 31 నాటికి సిలబస్ పూర్తిచేసేలా చర్యలు తీసుకోవడమే కాకుండా వెనుకబడిన విద్యార్థులను ఎస్ఏ–1లో వచ్చిన మార్కుల ఆధారంగా వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపి అధిక ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారు.

### ఉత్తీర్ణత పెంచే దిశగా..

సకాలంలో సిలబస్ పూర్తిచేయడంతోపాటు ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులు నైపుణ్యం సాధించి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ఉదయం 8:30 గంటల నుంచి 9:30 గంటల వరకు, సాయంత్రం 4:45 గంటల నుంచి 5:45 వరకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. సిలబస్ పూర్తిచేసిన అనంతరం జనవరి నుంచి పూర్తిస్థాయిలో ప్రతి రోజూ ఒక సబ్జెక్ట్‌పై విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. అనంతరం విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహించి వారిని ప్రీఫైనల్ ఎగ్జామ్స్‌కు సిద్ధం చేయనున్నారు.

### జనవరిలో సాయంత్రం పూట తరగతులు

చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం విద్యాశాఖ సూచనల మేరకు ఇప్పటికే డిసెంబర్ నుంచి ఉదయం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా, జనవరి నుంచి సాయంత్రం పూట అదనపు తరగతులు నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో భాగంగా విద్యాశాఖ అధికారులు సూచించిన సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వనున్నారు.

### ప్రతి సబ్జెక్ట్‌పై అవగాహన కల్పిస్తున్నాం



విద్యార్థులకు ఇప్పటికే అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. అదనపు తరగతులతో కచ్చితంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించగలమనే నమ్మకం ఉంది. పాఠశాలకు రాని పిల్లల గురించి వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నాం.

–యాస రాంకుమార్, తెలుగు పండిట్, పాతర్లపహాడ్

### వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

విద్యార్థుల్లో భయం తొలగించి పరీక్షలకు మానసికంగా సిద్ధం చేస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఇందుకు ప్రతి పాఠశాలలో అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థుల హాజరుపై చర్యలు తీసుకుంటున్నాం. అదనపు టీచర్లకు ప్రత్యేక తరగతుల బాధ్యతను అప్పగిస్తున్నాం.

–జి.కళారాణి, జిల్లా కామన్‌బోర్డు పరీక్షల సెక్రటరీ, సూర్యాపేట